క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు పూల కుండీ అందిస్తున్న రూరల్ సీఐ

చీమకుర్తి: జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను మంగళవారం చీమకుర్తిలోని వారి నివాసంలో ఒంగోలు రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఒంగోలు రూరల్ సర్కిల్‌కు రామకృష్ణారెడ్డి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కృతజ్ఞతలు తెలిపారు.

చీమకుర్తి ఎంపీడీఓ బదిలీ

చీమకుర్తి: ఎంపీడీఓగా పనిచేస్తున్న బీజే వండర్ మ్యాన్ మంగళవారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలోనే ఏఓగా పనిచేస్తున్న సీతారామారావుకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎఫ్ఏసీ ఇచ్చినట్లు సీతారామారావు తెలిపారు. వండర్ మ్యాన్‌ను జిల్లా పరిషత్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలంటూ జిల్లా అధికారులు ఆదేశించారు.

ఎయిడెడ్ స్కూల్ సందర్శన



చెరువుకొమ్ముపాలెంలో భోజనం వడ్డిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగర పరిధిలోని 18వ డివిజన్‌లో ఉన్న వార్డు సచివాలయాన్ని, ఎయిడెడ్ స్కూలును ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆమె తొలుత వార్డు సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ సిబ్బందిలో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెరువుకొమ్ముపాలెంలోని ఎయిడెడ్ స్కూల్లో విద్యార్థుల హాజరు రిజిస్టర్, భోజనం పరిశీలించారు. చిన్నారులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.

చలి గాలుల తీవ్రత

ఒంగోలు రూరల్: రూరల్‌లోని తీరప్రాంత గ్రామాల్లో చలి గాలుల ప్రభావం అధికమయింది. ఉదయం 10 గంటల వరకు జనం బయటకు రాలేకపోతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి అధిక ప్రభావం చూపడంతో గుండాయపాలెం, పాతపాడు, బొద్దులూరివారిపాలెం, దేవరంపాడు, దేవరంపాడు, కరవది, చేజర్ల గ్రామాల్లో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురియడం, తీరం నుంచి చల్లని గాలులు వీయడంతో ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి.

గ్రూప్-1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: త్వరలో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సిద్ధపడుతున్న అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్ వన్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించిన రాణి సుస్మిత ఉచిత మెంటర్‌షిప్ అందిస్తున్నారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన 21స్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.క్రిష్ణ ప్రదీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్సర్ రైటింగ్, జీఎస్, ప్రిపరేషన్ టిప్స్ తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 9133237733కి సంప్రదించాలని కోరారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



టిడ్కో ఇళ్ళ నిర్మాణాలకు వేసిన ఐరన్ సెంట్రింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



టిడ్కో ఇళ్ళను, పరిసరాలను పరిశీలిస్తున్న దృశ్యం

- 446 గృహాలకు బ్యాంకు రుణాలు మంజూరు
- నిర్మాణ దశలో 4,128
- పరిశీలించిన ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను, సిబ్బందిని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం కొప్పోలు, చింతలలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్ళను కమిషనర్ పరిశీలించారు. ఈ మేరకు సిబ్బందికి, కాంట్రాక్టర్లకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణాలకు సంబంధించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారికి తగు సూచనలు చేశామన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 4,128 టిడ్కో గృహాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వాటిలో కొప్పోలులో 2,736, చింతలలో 1,392 గృహాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 446 గృహాలకు సంబంధించిన లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. త్వరలో వాటిని పూర్తి చేయాలని సిబ్బందిని, అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మిగతా లబ్ధిదారులకు కూడా బ్యాంకు రుణాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. 300 చదరపు అడుగుల గృహాలకు సంబంధించి మొత్తం 1,536 ఇళ్ళు ఫినిషింగ్ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మిగతా గృహాలకు సంబంధించిన పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సీఎల్‌టీసీ ఆనంద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా

- వివరాలు వెల్లడించిన శ్రీసరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి



పాలెపు ప్రణయ్



మాట్లాడుతున్న శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి

ఒంగోలు: జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను సాధించారని శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. జేఈఈ మొదటి దశ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన మంగళవారం తమ కాలేజీ ఆవరణలో వివరాలను వెల్లడించారు. దర్శికి చెందిన విష్ణుమాధవ్ 99.07 శాతంతో ప్రకాశం జిల్లా చరిత్రను తిరిగరాశాడన్నారు. కేశవరపు నితీష్‌రెడ్డి 96.07, అంబటి శంకరరెడ్డి 96.36, బుర్రా ఆకాష్ 94.59, నేరెళ్ల వెంకట నవీన్‌కుమార్ 94.29, పేరం వివేకానందరెడ్డి 92.66, కైలాష్ అన్నుకుమార్‌రాయ్ 90.60 పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ ఎ.గణేష్‌రెడ్డి మాట్లాడుతూ 90 పర్సంటైల్‌పైన ఏడుగురు, 80 పర్సంటైల్‌పైన 28 మంది, 70 పర్సంటైల్‌పైన 64 మంది, జేఈఈ అడ్వాన్స్‌కు 123 మంది అర్హత సాధించారన్నారు.

అసాధారణ ప్రతిభ

దర్శికి చెందిన కంతా విష్ణు మాదవ్ పేరు ప్రస్తుతం జిల్లాలో మారుమోగుతోంది. తాజాగా విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో ఇతను 99.07పర్సంటైల్ సాధించడమే ఇందుకు కారణం, తల్లి గ్రామ సచివాలయ ఉద్యోగి కాగా తండ్రి దర్శిలో ప్రైవేటు కాలేజీ కరస్పాండెంట్, ఫిజిక్స్ లెక్చరర్, విష్ణుమాదవ్ పదో తరగతి వరకు దర్శిలోని కిజిజి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించాడు. ఇంటర్‌కు ఒంగోలు శ్రీసరస్వతీలో చేరాడు. తనకు శ్రీసరస్వతి విద్యాసంస్థలో అధ్యాపకులు అందించిన సహకారం మరువలేనిదని, ఒత్తిడిలేని విద్యను అందిస్తూ తన ఎదుగదలకు కారణమయ్యారని మీడియాకు తెలిపారు.

నాగభైరవ అసాధారణ ఫలితాలు

ఒంగోలు: తక్కువమంది విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించామని, త్వరలోనే పూర్వ ప్రకాశం జిల్లా చరిత్రను సైతం తిరగరాస్తామని నాగభైరవ విద్యాసంస్థల చైర్మన్ ఎన్.వీరబాబు తెలిపారు. మంగళవారం స్థానిక తమ కాలేజీలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కాలేజీలో 200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారిలో 36 మంది జేఈఈ మెయిన్స్ రాశారన్నారు. వారిలో అయిదుగురు విద్యార్థులు 90కిపైగా పర్సంటైల్ సాధించారన్నారు. నూతలపాటి మానస-96.7, ఎం.అభినయ్-95.2, కె.హరిణిశ్రీ-95.2, పీవీఎస్ దరహాస్-92.3, ఎంవీ సురేష్ బాబు 90.5 పర్సంటైల్ సాధించారన్నారు. ఇక శారీరక ఎదుగదల సరిగా లేని ఎస్.అభిరామ్ 67.4 పర్సంటైల్ సాధించారని, ఇతనికి ఓబీసీ, పీడబ్ల్యూడీ కోటా కింద జాతీయస్థాయిలో 200లోపు ర్యాంకు రావొచ్చని అంచనావేస్తున్నామన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నాగభైరవ విద్యాసంస్థల చైర్మన్ ఎన్.వీరబాబు



99.07 పర్సంటైల్ సాధించిన కంతా విష్ణుమాధవ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

గతంలో నాగభైరవ విద్యాసంస్థలు ప్రకాశం జిల్లాలో దశాబ్దకాలంపాటు అటు మెడిసిన్, ఇటు ఇంజినీరింగ్‌లో సంచలనం సృష్టించిందని, త్వరలోనే రికార్డులు తిరగరాస్తామని ధీమా వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల అద్భుత ప్రతిభ

ఒంగోలు టౌన్: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఒంగోలుకు చెందిన శ్రీ చైతన్య విద్యా సంస్థ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ జి.వెంకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలెపు ప్రణయ్ 98.48 శాతం మార్కులు సాదించగా, కె.లక్ష్మీ సాయి తన్మయి 98.32 శాతం మార్కులు సాధించి అత్యున్నత స్థాయిలో నిలిచినట్లు తెలిపారు. 90 శాతానికంటే అత్యున్నత మార్కులు సాధించి విద్యార్థుల సంఖ్య 16 మంది ఉన్నారన్నారు.

‘ఆత్మనిర్భర్ భారత్’ అమలుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: ఆత్మనిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన అమలుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పార్లమెంట్‌లో వేసిన ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా నూతన ఉద్యోగాల కల్పనకు, కోవిడ్ కాలంలో జరిగిన ఉద్యోగ నష్టాన్ని పూడ్చేందుకు, యజమానులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన పథకాన్ని 2020 అక్టోబరు 1న ప్రారంభించిందన్నారు. మొత్తం 71.80 లక్షల మందికి లబ్ధి చేకూర్చడం దీని ఉద్దేశమన్నారు. 2022 మార్చి 31 నాటికి 75.11 లక్షలమంది పేర్లు నమోదు చేసుకున్నారని, వారిలో 2023 జనవరి 24 నాటికి 1.51 లక్షల సంస్థల ద్వారా 60.26 లక్షలమంది లబ్ధి పొందారన్నారు. పేర్లు నమోదుచేసుకొనని యజమానులకు పోర్టల్ ద్వారా వర్తమానాలు పంపడం, జోనల్, వారి అసోసియేషన్లతో ప్రాంతీయ కార్యాలయాల ద్వారా ఆన్‌లైన్ వెబినార్లు నిర్వహించడం, సాంఘిక ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన, లక్ష్యాలు సాధించిన సంస్థలను ప్రోత్సహించడం, గడువు తేదీల గురించి ఎస్ఎంఎస్‌ల ద్వారా అన్ని విషయాలు తెలియజేయడం వంటి చర్యలు చేపడతామన్నారు. దీని వల్ల ఈ పథకంపై యజమానులు, ఉద్యోగస్తుల అవగాహన పెరుగుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పే వాడాలి



గార్లపాడులో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆనందమోహన్

మద్దిపాడు: అయోడైజ్డ్ ఉప్పును వాడక పోతే చిన్న పిల్లలలో బుద్ధి మాంద్యం వచ్చే అవకాశాలున్నాయని స్టేట్ కన్సల్టెంట్ ఫర్ ఆయోడిన్ సాల్ట్ ఎస్‌వీ సుమిత్ర జిల్లా ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రాజక్టు అధికారి డాక్టర్ భగీరధి అన్నారు. మంగళవారం ఘడియపూడి పరిధిలో ఉన్న గార్లపాడు, ఘడియపూడి ఎలిమెంటరీ పాఠశాలలను సందర్శించారు. చిన్నారులు అయోడిన్ ఉప్పు వాడకపోతే వారికి గాయాటర్ వ్యాధి వస్తుందని దానివలన బుద్ధి మాంద్యం ఏర్పడుతుందన్నారు. ఉప్పును తగినంత మేరకు వాడుకోవాలని వారు సూచనలు చేశారు. మంగళవారం గార్లపాడు, ఘడియపూడి కాలనీలలో అయోడిన్ సాల్ట్ సర్వే నిర్వహించారు. విద్యార్థుల మూత్రం సేకరించి టెస్టులకు పంపనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి డాక్టర్ ఆనందమోహన్ ఎంపీహెచ్ఎస్‌లు బాలకోటయ్య, నాగేశ్వరరావు రోషిణి, కామేశ్వరి దరియా ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ఉత్తమ సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

చీమకుర్తి: ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్ళి డబ్బులు ఖర్చు చేసుకోకుండా.. చీమకుర్తిలోని ప్రభుత్వాసుపత్రికి రావాలని.. స్పెషలిస్ట్ డాక్టర్‌లచే వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని జనరల్ సర్జన్ వేణుగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎం.వేములపాడు పీహెచ్‌సీలో జరిగిన ఆషాడే కార్యక్రమంలో పాల్గొన్నారు. చీమకుర్తి ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు ఉచితంగా స్కానింగ్, కర్తపరీక్షలు చేయటమే కాకుండా కాన్పులు చేస్తారని తెలిపారు. ఈఎన్‌టీ, కంటి వైద్యనిపుణులు, శస్త్ర చికిత్స వైద్యనిపుణులు, చిన్న పిల్లల వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నరని తెలిపారు. గర్భిణులకు ఉచిత రవాణా, ఉచిత కాన్పు, ఉచిత టీకాలతో పాటు రూ.5 వేలు అందిస్తారన్నారు. స్థానిక వైద్యులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో లాభం



పోతవరంలో అధికారులు

నాగులుప్పలపాడు: మిరప సాగు పంటలలో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా పోతవరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలని, సూక్ష్మధాతువుల లోపం లేకుండా చూసుకోవాలన్నారు. విచక్షణా రహితంగా పురుగు మందులు వాడకం తగ్గించాలని తెలిపారు. అనంతరం పంట నమోదు చేసిన పొలాలకు సూపర్ చెక్ కూడా చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది శృతి, హరిక, ప్రకృతి ఉన్నారు.

ఆర్టీసీ స్టాపింగ్ పాయింట్ల గుర్తింపు



ఆర్టీసీ స్టాపింగ్ పాయింట్లను గుర్తిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు మంగళవారం నగరంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాస రావు సిబ్బందితో కలిసి పర్యటించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా బస్సులను నిలిపేందుకు రిక్వెస్ట్ పాయింట్లను గుర్తించారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ట్రాఫిక్ తెలిపారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ షహెనా బేగం, మోటార్ వెహికల్ ఇనెస్పెక్టర్ జగదీశ్, మున్సిపల్ ఇంజినీర్ రామకోటయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం



తనిఖీల్లో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

నాగులుప్పలపాడు: విద్యుత్ చౌర్యంతో పాటు పరిమితికి మించి విద్యుత్ వినియోగం నేరమని ఏడీఏలు వినయ్‌కుమార్ రెడ్డి, మోహనరావు తెలిపారు. అక్రమ విద్యుత్ కనెక్షన్‌లు, దొంగ విద్యుత్ వాడకం, పరిధికి మించి వినియోగంపై మంగళవారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు, పోతవరం, నాగులుప్పలపాడు, నిడమానూరు తదితర గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 160 మంది వినియోగదారులకు 6 లక్షల 16 వేల రూపాయల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. పోతవరంలో దొంగ విద్యుత్ కనెక్షన్‌లు వినియోగిస్తున్న ముగ్గురిని గుర్తించి ఒక్కొక్కరికి 6 వేల రూపాయల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. డీపీఈ విజిలెన్స్ అధికారులు తోట శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు, ఏఈ రమేష్ , సిబ్బంది ఉన్నారు.

గర్భిణుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయండి



ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి

చీమకుర్తి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండాలని డీఎంహెచ్ఓ ఎస్. రాజ్యలక్ష్మి చెప్పారు. మంగళవారం సంతనూతలపాడులోని పీహెచ్‌సీ, అనంతరం ఎండ్లూరు ఎంపీయూపీ స్కూలును సందర్శించారు. స్థానిక డాక్టర్‌లు, వైద్యసిబ్బందితో మాట్లాడుతూ పూర్తి సదుపాయాలను కల్పించటమే కాకుండా సకాలంలో వారికి అవసరమైన వైద్యపరీక్షలను చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులలో అయోడిన్ లోపంతో ఉన్న వారిని గుర్తించి వారికి అయోడిన్ ట్యాబ్లెట్లను అందించాలన్నారు. స్థానిక డాక్టర్‌లు హరిణి, నాగేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

చీరాల: వేటపాలెం మండలం కొత్తపేటలోని ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. టూటౌన్ సీఐ సోమశేఖర్ వివరాల మేరకు.. కొత్తపేటలోని గ్యాస్ గొడౌన్ సమీపంలో ఆకుల మణి గత 29న హైద్రాబాద్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లారు. మంగళవారం మణి ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి ఆమెకు, పోలీసులకు సమాచారం అందించారు. ఇంటిలో ఉన్న 2 సవర్ల బంగారంతో పాటు 120 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి

రమాబాయి అంబేడ్కర్ త్యాగం శ్లాఘనీయం



రమాబాయికి నివాళి అర్పిస్తున్న నాగినేని ఆర్ట్స్

ఒంగోలు టౌన్: అస్పృశ్యత నుంచి దళితుల జాతి విముక్తి కోసం, దేశంలోని మహిళల చైతన్యం కోసం రమాబాయి అంబేడ్కర్ చేసిన త్యాగం ఎనలేనిదని దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు కొనియాడారు. స్థానిక అంబేడ్కర్ భవన్లో మంగళవారం రమాబాయి అంబేడ్కర్ 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విజయం వెనుక రమాబాయి ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. తమ నలుగురు బిడ్డలను పోగొట్టుకొని కూడా ఆశయ సాధన కోసం వెనకడుగు వేయని రమాబాయి జీవితాన్ని దళిత, బహుజన, మైనార్టీ, ముస్లిం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. దళిత నాయకులు చప్పిడి రవిశంకర్, యానాది మహానాడు నాయకులు తలపుల శ్రీనివాసరావు, జర్నలిస్టు సంఘం నాయకులు పైనమ్ సురేంద్ర, వెంకటరావు, యోహాను, రాంబాబు పాల్గొన్నారు.

నాగినేని మెమోరియల్స్ ఆధ్వర్యంలో..

నాగినేని నరసింహారావు మెమోరియల్స్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో రమాబాయి జయంతి ఘనంగా జరిగింది. పిడకలు అమ్మిన కష్టార్జితంతో ప్రపంచానికి గొప్ప మేధావిని అందించిన ఆమె త్యాగాన్ని ఎంత కొనియాడినా తక్కువేనని రంగస్థల కళాకారుడు పాడిబండ్ల ఆనందరావు అన్నారు. రమాబాయిని తలచుకోవడం అంటే మన కన్నతల్లిని తలచుకోవడమే అని అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జునరావు, కనమాల రాఘవరావు అన్నారు. కె.మోహన్ రాజు, వైఖానస ఆగమ వేద పండితులు డాక్టర్ పరాంకుశం కేశవాచార్యులు, కుర్రా ప్రసాద్ బాబు, మొగిలి దేవ, డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు, అంగలకుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఈ భవనం ఎందుకో?



ఒంగోలు రూరల్: కరవది గ్రామ పంచాయతీ పరిధిలో గత నాలుగేళ్ళ క్రింతం మహిళా మండల భవనం రూపుదాల్చింది. ఈ భవనం ఎందుకు నిర్మించారో ఎవరి కోసం నిర్మించారో అన్న విషయం ఇప్పటికి మిలియన్ డాలర్స్ ప్రశ్నగా మారింది. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ళ క్రింత ఆగమేఘాలపై మహిళా సమాఖ్య భవనం అంటూ నిర్మాణం చేపట్టారు. గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్ శ్లాబులు పూర్తయిన తరువాత నిర్మాణాన్ని అర్ధాంతరంగా ఆపివేసి ఒంగోలులోని మండల పరిషత్ కార్యాలయంలో ఇదే డిజైన్‌తో రెండంతస్తుల భవనాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తయిన తరువాత గ్రౌండ్ ఫ్లోర్‌ను ఎన్ఆర్‌జీఈఎస్ కార్యాలయానికి ఉపయోగిస్తుండగా ఫస్ట్‌ఫ్లోర్‌ను ఒంగోలు మండల మహిళా సమాఖ్య భవనంగా రూపొందించారు. ఈ భవనంలోనే డీఆర్‌డీఏ, ఏపీఎం తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కరవదిలో భవనం వదిలివేశారు. దీంతో అప్పుడు భవన నిర్మాణం కోసం తీసుకువచ్చిన సిమెంటు బస్తాలు పనికిరాకుండా పోయింది. సమీప పశుపోషకులు ఈ భవనంలో తమ గడ్డిని నిల్వ చేసుకునేందుకు, వర్షాకాలంలో.. ఎండాకాలంలో తమ పశువుల రక్షణ కోసం వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుకున్నారు.